# జగన్నాథం భార్య

డి. సరస్వతి



"నువ్వెన్నయినా చెప్పు బావా ! నా అభిప్రాయం మారదు. నేను మాత్రం చదువుకున్న పిల్లను చేసుకోను," అన్నాడు జగన్నాథం.

"ఇదెక్కడి విడ్డూరమోయ్ ! అందరూ భార్య డిగ్రీ ఉన్నదై ఉండాలనీ, అవసరమైతే ఉద్యోగం కూడా చేయాలని కోరుకుంటున్నారు కదా! నీ కీ అమ్మమ్మ భావా లేమిటోయ్!" అని బావమరిది ప్రసాద్ నవ్వసాగేడు.

"నా సంపాదనతో నా సంసారం సుఖంగా బ్రతకవచ్చు బావా! అంచేత నా పెళ్ళాం ఉద్యోగం చేయవలసిన అవసరం లేదు. చదువు తక్కువైన పిల్లయితే అణకువగా, విధేయతగా ఉంటుంది. 'నువ్వెంతంటే నువ్వెంతనే' చదువుకున్న పిల్లతో నేను సంసారం చేయలేను," అన్నాడు జగన్నాధం.

ప్రసాద్ ఆశ్చర్యంగా, "మీ అక్కగ్రాడ్యుయేటు కదా! మేము సుఖంగా లేమా?" అన్నాడు.

"అందరూ మా అక్కలాగా నెమ్మదిగా ఉంటారని గ్యారంటీ ఏముంది!" అన్నాడు జగన్నాధం

"ఉండరని మాత్రం గ్యారంటీ ఏముంది?" అని ఎదురుప్రశ్న వేశాడు ప్రసాద్. బావ మాటలకు ఒప్పుకుండినా జవాబివ్వలేక మౌనంగా ఉండిపోయాడు జగన్నాధం.

"చూడు జగ్గూ! చదువుకున్నపిల్ల నెమ్మదిగా ఉండవచ్చు. చదువుకోనిపిల్ల పెడసరంగానూ ఉండవచ్చు. చదువులోని ఎక్కువ తక్కువలనుబట్టి స్వభావ నిర్ణయం చేయలేము. అదీగాక భార్య అణిగిమణిగి ఉండాలని కోరుకోవడం అసందర్భమూ, అనుచితమూను. ఒకరి వ్యక్తిత్వాన్ని ఒకరు అర్థంచేసుకొని స్నేహానురాగాలతో బ్రతకడంలోనే సుఖం ఉంది," అన్నాడు ప్రసాద్ నచ్చజెప్పే ధోరణిలో.

"నీ అభిప్రాయాలూ, నా అభిప్రాయాలూఏకీభవించాలన్న రూలేమీ లేదు బావా! నాకు మాత్రం ఎనిమిదో క్లాసు చదివిన పిల్లయినా చాలు. పిల్ల మాత్రం అందంగా ఉండాలి అంతే," అనేసి జోళ్లు తొడుక్కొని వీధిలోకి వెళ్ళిపోయాడు జగన్నాధం.

"ఇలాగుందోయ్ వీడి వరస," అని నుదురు కొట్టుకున్నారు తండ్రి ప్రకాశరావుగారు.

"వీడేమో బి. ఇ. ఫస్టుక్లాసులో ప్యాసై ఉద్యోగం వెలగబెడుతున్నాడు. బి ఏ., ఎమ్ ఏ. చదివిన పిల్లల్ని ఇస్తామని వస్తున్నారు. ఈ రోజుల్లో ఆడపిల్లల్ని కూడ మంచి సంబంధం వస్తుందన్న ఆశతోనో, కాకపోతే ఉద్యోగం చేస్తుందన్న ఉద్దేశ్యంతోనో బాగా చదివిస్తున్నారు కదా! వీడి కసలు అంత తక్కువగా చదువుకున్న పిల్ల దొరుకుతుందా అని నా అనుమానం," అన్నారాయన అల్లుడితో.

"మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు ప్రసాద్.

"మాకేమో చదువుకున్న పిల్లను చేయటం ఇష్టమే. మా కోడలు బి.ఏ. ప్యాసయిందని చెప్పుకోవడం మాకు మాత్రం ముచ్చట కాదూ కాని వీడి పిడివాదం ఇలాగ ఉందికదా? ఇష్టంలేని పెళ్ళి ఎట్లాగ చేయగలం?" అంది జగన్నాధం తల్లి నిస్పృహతో.

* * *

నలుగురితో కలివిడిగా తిరగటం కాని, ఇతర పుస్తకాలు చదివే అలవాటు కాని లేని జగన్నాధానికి ప్రపంచజ్ఞానం తక్కువనే చెప్పాలి చదువుకునే రోజుల్లో తన రూమ్మేటు కమలాకరంతో మాత్రం బాగా కలిసిపోయాడు. తనకంటె ఏడాది పెద్ద అయిన కమలాకరాన్ని గురువుగా భావించేవాడు.

చదువు పూర్తయిన కొద్దికాలానికే కమలాకరానికి హైదరాబాద్‌లో మంచి ఉద్యోగం కలిసివచ్చింది. ఉద్యోగంలో చేరిన సంవత్సరానికి బి.ఏ. ప్యాసయిన రమతో వైభవంగా వివాహం జరిగింది. పెళ్ళికి వెళ్ళిన జగన్నాధం రమ కమలాకరానికి సరైన జోడీ అనుకున్నాడు

కొంతకాలం తరువాత ఏదో ఇంటర్వ్యూ కోసం హైద్రాబాద్ వెళ్ళిన జగన్నాధం కమలాకరం ఇంట్లోనే బసచేశాడు. అతనక్కడ ఉన్న నాలుగు రోజుల్లో రమ ఒక్కసారి మాత్రం కనబడి పలకరించింది. సభలనీ, పార్టీలనీ ఎక్కడికో అక్కడికి వెళ్ళిపోతూ ఉండేది. కమలాకరానికి, జగన్నాధానికి కావలసినవాటిని వంటమనిషి, పని కుర్రవాడు చూసేవారు. కమలాకరంలో పూర్వపు ఉత్సాహంకూడ కనబడలేదు. షికారుకి వెళ్ళినప్పుడు ఆ మాటే అన్నాడు అతన్తో. కమలాకరం చాలాసేపు దూరాలకు చూస్తూ ఉండిపోయాడు.

"నువ్వు మాత్రం చదువుకున్న పిల్లను చేసుకోకు జగ్గూ," అన్నాడు హఠాత్తుగా.

"మా ఆవిడను చూస్తున్నావు కదా! ఒక్క క్షణం ఇంటిపట్టున ఉండదు. క్లబ్బులకనీ, షాపింగనీ ఏదో నెపంతో తిరుగుతూనే ఉంటుంది. నా అవసరాలు చూడదు. ఏమైనా అంటే, 'నామీద అధికారం చెలాయించి నన్ను బానిసలాగా చూడటానికి ప్రయత్నించకండి' అంటూ పోట్లాటకి వస్తుంది. బాబో, పాపో పుడితే కొంత మనశ్శాంతి ఏర్పడు తుందనుకుంటే ఇప్పటినించి పిల్లలు వద్దంటుంది. వంటవాళ్ళు, పనివాళ్ళు ఉన్నా ఇంటికి రాగానే భార్య పలక రించాలనీ, కాఫీ అయినా ఇవ్వాలనీ ఆశించడం తప్పుకాదు కదా! ఇప్పుడిక ఎంత విచారించినా లాభమేముంది? అందుకేరా జగ్గూ; నువ్వు హైస్కూలు చదువు దాటని పిల్లను చేసుకో. నీ చెప్పుచేతల్లో ఉండి నిన్ను సుఖపెడు తుంది," అన్నాడు కమలాకరం.

పెళ్ళి గురించికాని, తనకాబోయే భార్యగురించికాని ఏ విధమైన అభి ప్రాయమూ లేని జగన్నాధం మనస్సులో కమలాకరం మాటలు గాఢంగా నాటుకు పోయాయి. ఒక్క వ్యక్తినికాని, ఒక్క సంసారాన్ని గాని చూచి ఒక అభి ప్రాయానికి, నిర్ణయానికి రావటం సమం జసం కాదని అతను అనుకోలేకపోయాడు.

తన కంటే అప్తుడైన కమలాకరం చెప్పినట్లు తాను తక్కువ చదువు ఉన్న పిల్లనే చేసుకోవాలనుకున్నాడు.

*　　*　　*

జగన్నాధం ఉద్యోగానికి అనుకూలమైన సంబంధం ఉందని, పెళ్ళికూతురు తండ్రి బ్యాంకులో ఆఫీసరుగా పనిచేస్తున్నారనీ ఉత్తరం వ్రాసేడు ప్రసాద్. మంచిరోజు చూసుకొని పెళ్ళికూతురు కమల తండ్రి రాఘవరావుగారు పెళ్ళి ప్రకాశరావుగారిని, భార్యను పెళ్ళిచూపులకు రమ్మని ఆహ్వానించారు. ముందుగానే జాతకాలు, ఫోటోలు చూసుకున్నారు. అన్నీ కుదిరేయి.

తండ్రి వ్రాసిన ఉత్తరం చూసుకొని జగన్నాధం సెలవుపెట్టి వచ్చాడు. అందరూ కలిసి కమలను చూడటానికి వెళ్ళారు

కమల అందం చూసి జగన్నాధం కళ్ళు తిప్పుకోలేకపోయాడు. చదువు బొత్తిగా తక్కువని కించగా ఉన్నా కమల చక్కదనం, వినయం చూసి ముచ్చటపడ్డారు జగన్నాధం తల్లిదండ్రులు.

"మా పెద్దమ్మాయిలిద్దరూ బి.ఏ. పాసయ్యేరండీ ! దీనికే చదువుమీద ఆసక్తి లేక ఎనిమిదో క్లాసుతోనే ఆపేసింది. అయితేనేం—అన్ని రకాల కుట్లు, అల్లికలు నేర్చుకుంది. వంటా వార్పూ, ఇల్లు దిద్దడం బాగా వచ్చు." అంది కమలతల్లి.

అందరూ చెప్పగా కమల అతికష్టం మీద సిగ్గును ప్రక్కకుపెట్టి ఒక్కసారి కళ్ళెత్తి జగన్నాధం వైపు చూసింది. అంతే ! చామన ఛాయతో మంచి ఒడ్డూ పొడుగుతో ఆకర్షణీయంగా ఉన్న జగన్నాధం ఆమె కలల్లోని హీరో అయిపోయాడు.

రాఘవరావుగారు మంచి కట్నం, లాంఛనాలు ఇచ్చి కమల పెళ్ళి జగన్నాధంతో ఎంతో వైభవంగా జర్పారు.


*　　*　　*

జగన్నాధం సంసారం హాయిగా, తీయగా సాగిపోతూంది. కమల ఇంటిని నీటుగా ఉంచడంలో, వంటపనిలో సిద్ధహస్తురాలు. ఒక్క క్షణం వృధా చేయకుండా అన్నిపనులూ చకచకా చేసుకుపోయేది. జగన్నాధం నోట్లోంచి మాట రాకుండానే అతని అవసరాలు తెలుసుకొని అమర్చిపెట్టేది. డబ్బును పొదుపుగా వాడేది. చక్కగా అలంకరించుకొని శుభ్రంగా ఉంటూ అతన్ని నవ్విస్తూ ఉండేది తన కబుర్లతో.

"చదువుకున్న వాళ్ళెందుకు పనికొస్తారు నా కమల ముందు ?" అని గర్వపడేవాడు జగన్నాధం.

*　　*　　*

ఆ రోజు జగన్నాధం ఆఫీసుకు వెళ్తూ, "సాయంత్రం మా ఫ్రెండు గంగారాం ఇంటికి వెళ్దాం. సిద్ధంగా ఉండు కమలా," అని చెప్పి వెళ్ళాడు.




కమల వంట ముగించి ముస్తాబైంది. జగన్నాథం వచ్చాక ఇద్దరూ కలిసి వెళ్ళారు.

"హాయ్ కమలా! నువ్వేనా?" అంటూ గంగారాం భార్య సునీత ఆనందాశ్చర్యాలతో ఎదురొచ్చి కమల చేతులు పట్టుకొని ఊపేసింది.

"మా కమల మీ కెలా తెలుసు?" అని ఆశ్చర్యపోయాడు జగన్నాథం.

"కమల బి.ఏ.లో నా క్లాసుమేటండీ! నా బెస్టుఫ్రెండు కూడాను," అంది సునీత. కమల ముఖం పాలిపోయింది. ఏదో అనబోయిన జగన్నాథం ఎందుకో ఊరికే ఉండిపోయాడు.

'తనభార్య ఎనిమిదో క్లాసు మాత్రమే చదివిందని చెప్పాడెందుకబ్బా,' అని లోలోన ఆశ్చర్యపోయాడు గంగారాం.

అందరూ లోపలికి వెళ్ళి కూర్చున్నారు. కొంచెంసేపు కబుర్లు సాగేయి. సునీత అందరికీ కాఫీ ఫలహారాలు తెచ్చి పెట్టింది. చదువుకొనే రోజుల్లో గలగలా నవ్వుతూ గుక్కకు వెయ్యి కబుర్లు చెప్పే కమల ముభావంగా, పరాగ్గా ఉన్నట్లు గమనించింది సునీత. ఇల్లు చూపే నెపంతో లోపలికి తీసుకొని వెళ్ళింది

"ఏమే కమలా? అలాగున్నావేం? మీవారు నీ మాటలకు కంట్రోలు పెట్టారా?" అని అడిగింది.

"అబ్బె, అదేంలేదే! ఇక్కడికి వచ్చే ముందే తలనొప్పి మొదలైంది. కాని మీరు ఎదురుచూస్తూ ఉంటారు కదాని వచ్చేశాం" అంది కమల తడబాటుగా. సునీత కా జవాబు సంతృప్తి నివ్వలేదు. కాని ఆమె మరి రెట్టించలేదు కమలకు బొట్టుపెట్టి తాంబూలం ఇచ్చింది.

"మా ఇంటి కోసారి రావే సునీతా,"

అంది కమల వెక్కిముందు సునీత చేయి ఆప్యాయంగా నొక్కుతూ.

* * *

నిశ్శబ్దంగా నడుస్తున్న భర్తను చూస్తూ ఏదో తెలియని భయంతో వొణికిపోయింది కమల. ఎప్పటిలాగా ప్రక్కన నడుస్తూ కబుర్లు చెప్పగల ధైర్యం లేకపోయింది మౌనంగా ఇల్లు చేరారు. కమల, ఆమె తల్లిదండ్రులు మోసగించారన్న కోపంతో, అవమానంతో దహించుకుపోతున్న జగన్నాథం కమల లోపలికి రాగానే ఎడా పెడా కొట్టాడు. 'నువ్వొక నటివి, మోసగత్తెవి' అని తిట్టాడు.

"ఏమండీ? నాతోగాని, నా ప్రవర్తనలోగాని ఏమైనా లోపం చూసేరా!" అని జాలిగా ఏడుస్తూ అడుగుతున్న కమలను చూస్తుంటే అతని మనస్సు మరింత మండిపోయింది.

"నన్నెందు కింత మోసం చేసేరు? చదువుకున్న పిల్ల వద్దని నేను బావతో ముందే చెప్పేనే? అతను మీవాళ్లతో చెప్పలేదా?" అని అరిచాడు కోపంగా.

"మీ బావ చెప్పేరు. కుజ దోషం ఉండటంవల్ల నాకు సంబంధం కుదరటం కష్టమైంది మనిద్దరి జాతకాలూ నప్పేయి. అన్నివిధాలా అనుకూలమైన సంబంధం వదులుకోలేక మావాళ్ళు అలాగ చెప్పేరు. ఆ సంగతి మీ బావకు ముందే తెలుసు" అంది వెక్కుతూ.

"అయితే మా బావా, మీరూ కలిసి ఆడిన నాటకం అన్నమాట. ఛీ!" అని చీత్కారం చేసి పడకగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి ఇద్దరికీ భోజనాలు లేవు. కమల వెక్కి వెక్కి ఏడుస్తూ హాల్లో ఉన్న సోఫాలో పడుకొని ఉండిపోయింది.

* * *

రాత్రంతా నిద్రపట్టక అశాంతిగా దొర్లిన జగన్నాథం వీధితలుపు బాదుతున్న చప్పుడు విని, ఉలిక్కిపడి లేచాడు. అప్పటికే ఎండ బాగా వచ్చేసింది. విసుక్కుంటూ లేచి వెళ్ళి తలుపు తీశాడు. పాలవాడు, పనిమనిషి నిలబడి ఉన్నారు. తలుపు తీయగానే పనిమనిషి తిన్నగా పెరట్లోకి వెళ్ళిపోయింది. జగన్నాథం విసుక్కుంటూ పాలు పోయించాడు. వంటింట్లోకి వెళ్తూ హాల్లో సోఫాలో ముడుచుకొని పడుకున్ని ఉన్న కమలను చూశాడు.

"ఇంక సాగిస్తుంది కాబోలు! పుట్టింటికి పంపిస్తే తెలిసివస్తుంది!" కోపంగా అనుకుంటూ దగ్గరికి వెళ్ళి, "కమలా, కమలా," అని పిలిచాడు.

"నన్ను కొట్టకండి! క్షమించండి!" అని కలవరిస్తూ ఒత్తిగిలిన కమల సోఫాలోంచి పడిపోయింది. జగన్నాథానికి కంగారుపుట్టి ఒళ్లు ముట్టుకుని చూశాడు. ఆమె ఒళ్లు

జ్వరంతో పేలిపోతూంది. జగన్నాధానికి మతిపోయినంత పనైంది. పనిమనిషిని కేకేశాడు. ఆమె సాయంతో కమలను మంచం మీద పడుకోబెట్టాడు ఆదరాబాదరా ముఖం కడుక్కొని డాక్టరు దగ్గరకు పరుగెత్తాడు. డాక్టరు వచ్చి కమలకు ఇంజక్షనిచ్చి, మాత్రలు వ్రాసిచ్చి వాడమని, కంగారేం లేదని చెప్పి వెళ్ళాడు.

* * *

కమలకు సపర్యలు చేస్తూ రాత్రిం బవళ్ళు కమలమంచం ప్రక్కనే ఉండి పోయాడు జగన్నాధం. తను ఆమెను దారుణంగా కొట్టడంవల్లనే ఆమె జ్వరం పడిందనుకున్నాడు. ఆమె కలవరింతలు వింటూ, ఆమె మనస్సును గాయపరిచి నందుకు పశ్చాత్తాపంతో క్రుంగి పోయాడు. తన జీవితంలోకి వెలుగు లాగా వచ్చిన కమల తనకు అందిస్తున్న సుఖసంతోషాలు ఎనలేనివి ! ఉన్నత విద్యే ఆమెనంత సంస్కారం, మంచి తనం, మూర్తీభవించిన యువతిగాను, అన్నిట్లో నేర్పరిగాను తీర్చిదిద్దిందేమో ! బావ అన్నట్లు చదువునుబట్టి స్వభావ నిర్ణయం చేయడం పొరపాటు! తన కమల బి ఏ. అనుకుంటూంటే ఇప్పు డెంత గర్వంగా, తృప్తిగా, సంతోషంగా ఉంది ! కాని కమల తన అవివేకాన్ని, మూర్ఖత్వాన్ని క్షమిస్తుందా? పూర్వంలాగా తామిద్దరు హాయిగా ఉంటారా ?" అని ఆలోచిస్తూ కమలకు పూర్తిగా తెలివి వచ్చేవరకు జగన్నాధం క్షణ మొక యుగంగా గడిపాడు.

* * *

కమల కళ్ళు తెరిచి భర్తవేపు చూసింది. కమలను అక్కున చేర్చుకోవాలని, క్షమాపణ కోరుకోవాలని, ఎన్నో తియ్యటి కబుర్లు చెప్పాలని అనుకున్న జగన్నాధం ఆమె కళ్ళలోకి చూడలేక తల త్రిప్పుకొని కిటికీలోంచి దూరానికి చూస్తూ ఉండిపోయాడు.

భర్తకు తనమీదకోపం పోలేదనీ అందుకే తనవైపు చూడటంలేదని అనుకుంది కమల.

"ఏమండీ! నన్ను క్షమించలేరా ?" అంది దీనంగా. ఇంక జగన్నాధం నిగ్రహించుకోలేకపోయాడు. ఒక్క ఉదుటున వెళ్ళి మంచంమీద కూర్చుని ఆమెను ఒళ్ళోకి తీసుకున్నాడు.

"నువ్వే నన్ను క్షమించాలి కమలా! మీవాళ్ళు నిజమే చెప్పి ఉండే మూర్ఖత్వంతో నిన్ను ఒదులుకొని ఉండే వాడిని. నీకు డిగ్రీ ఉన్నందుకు నా కిప్పుడెంతో గర్వంగా, సంతోషంగా ఉంది కమలా," అన్నాడు జగన్నాధం ఆమెను ఆప్యాయంగా నిమురుతూ. మనస్సులోని ఆవేదనంతా పటాపంచలై, మాటలకందని ఆనందంతో నిండిపోగా భర్త పరిష్వంగంలో కరిగిపోయింది కమల